క్లుప్తంగా

పోలింగ్ సరళి పరిశీలించిన కోమటిరెడ్డి



కనగల్ ఎక్స్ రోడ్‌లో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి బయటకు వస్తున్న కోమటిరెడ్డి

కనగల్: మండల వ్యాప్తంగా వివిధ పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగింది. కనగల్ జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, ఎంపీపీ ఎస్ కే కరీం పాష తదితరులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నల్లగొండ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కనగల్, జి.యడవల్లి, కురంపల్లి, రేగట్టె తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. జి ఎడవెల్లి గ్రామంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. ఎస్ఐ అంకిరెడ్డి జోక్యం చేసుకొని ఇరువురిని శాంతింపచేశారు. శేరిలింగోటంలో స్థానిక సర్పంచ్ భర్త పై కానిస్టేబుల్ చేయి చేసుకోవడంతో స్వల్ప ఘర్షణ జరిగింది.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అభ్యర్థులు



చిట్యాల పోలింగ్ కేంద్రంలోకి వెళ్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు గురువారం పరిశీలించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం, బీఎల్ఎఫ్ అభ్యర్థి నూనె వెంకటస్వామి, స్వతంత్ర అభ్యర్థి గంటిపాక స్వామిలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటింగ్ సరళిని వారు ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు.

తిప్పర్తిలో 89.95 శాతం పోలింగ్ నమోదు



ఓటు వేసేందుకు క్యూ కట్టిన మహిళా ఓటర్లు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలో 89.95 శాతం పోలింగ్ నమోదయింది. మండలంలో మొత్తం 37 పోలింగ్ స్టేషన్లలో పురుషులు 14331, స్త్రీలు 14869 కలిపి మొత్తం 29200 ఓట్లు ఉన్నాయి. గురువారం జరిగిన పోలింగ్‌లో పురుషులు 12962, స్త్రీలు 13304 కలిపి 26266 ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

వలంటీర్ల సేవలు

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఓటు వేసేందుకు స్వల్పంగా వచ్చిన ఓటర్లు మధ్యాహ్నం తర్వాత ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులుదీరారు. వలంటీర్లు వృద్ధులను వీల్ ఛైర్‌లో తీసుకువచ్చి ఓటు వేయించారు. మండలంలోని అప్పాజిపేటలో 7 గంటల వరకు, అనంతారంలో 6 గంటల వరకు ఓటింగ్ కొనసాగింది.

ముగిసిన పోలింగ్



నల్లగొండలోని సెయింట్ ఆల్ఫోన్సస్ స్కూల్‌లో పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో నిల్చున్న ఓటర్లు

నల్లగొండ : నల్లగొండ నియోజకవర్గంలో పోలింగ్ 81.5 శాతం నమోదయింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. 5 గంట వరకు క్యూలో నిల్చున్న ఓటర్లకు రాత్రి వరకు కూడా ఓటు వేసే అవకాశం కల్పించారు.

పోలింగ్ సరళి ఇలా..

నల్లగొండ నియోజకవర్గంలో 284 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రెండు గంటల్లో 9 శాతం పోలింగ్ నమోదు కాగా 11 గంటలకు 17.6 శాతానికి పోలింగ్ పెరిగింది. కాగా మధ్యాహ్నం 3 గంటలకు 60.66 శాతానికి చేరుకోగా సాయంత్రం 5 గంటలకు 71.01 శాతం నమోదయింది. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో బారులుదీరిన ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించారు.

పోలీసులతో వాగ్వాదం

నల్లగొండ పట్టణంలోని అక్కలాయిగూడెం పోలింగ్ కేంద్రం వద్ద ఫార్వర్డు బ్లాక్ పార్టీ అభ్యర్థి పిల్లి రామరాజుయాదవ్ వెంట అధికంగా జనాలు గుమికూడడంతో పోలీసులు అక్కడికి వచ్చి దూరంగా పోవాలని సూచించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున అధికంగా జనాలు ఉండడం నిబంధనలకు విరుద్ధమని చెప్పడంతో అభ్యర్థికి, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో పోలీసు బలగాలు అక్కడకు చేరుకుని వారికి సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్లు

నల్లగొండ పట్టణలలోని బోయవాడ ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రంలో 18 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ట్రాన్స్‌జెండర్లకు ఓటు హక్కు నమోదు చేసుకునేలా కలెక్టర్ అవగాహన కల్పించడంతో వారు ఈసారి ఓటు నమోదు చేసుకున్నారు.



కేశరాజుపల్లిలో ఓటు వేయడానికి బారులుదీరిన ఓటర్లు

మునుగోడు నియోజకవర్గంలో..

చండూరు : మునుగోడు నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే .దామోదర్‌రావు తెలిపారు. మునుగోడు నియోజకవర్గంలో 307 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 2,52,648 ఓటర్లకు గాను పురుషులు 1,16,114 మంది, మహిళలు 1,15,0082 మంది, మొత్తం 2,31,197 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆర్ఓ తెలిపారు. నియోజకవర్గంలో 91.51 శాతం పోలింగ్ నమోదయిందని వివరించారు. పటిష్టమైన పోలీస్ బందోబస్తు మధ్య ఉదయం ఏడు గంటలకు ఓటింగ్ ప్రక్రియను అధికారులు ప్రారంభించగా రాత్రి ఎనిమిది గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ప్రతి రెండు గంటలకు ఒకసారి అధికారులు ఓటింగ్ శాతాన్ని ప్రకటించారు.

మండలాల వారిగా ..

చౌటుప్పల్‌లో 62,869 ఓట్లకుగాను 58,153 ఓట్లు పోలయ్యాయి. 92.50 శాతం పోలింగ్ నమోదయింది, నారాయణపురంలో 38,542 ఓట్లకు గాను 35,521 ఓట్లు పోల్ కాగా 92.16 శాతం, గట్టుప్పలలో 15,100 ఓట్లకు గాను 13,704 ఓట్లు, 90.75 శాతం, మునుగోడులో 36,816 ఓట్లకు గాను 33,825 పోల్ కాగా 91.88 శాతం, చండూరులో 34,619 ఓట్లకుగాను 31,694 ఓట్లు పోల్ కాగా 91.55 శాతం, నాంపల్లిలో 35,122 ఓట్లకుగాను 32,129 ఓట్లు కాగా 91.48 శాతం, మర్రిగూడంలో మొత్తం 29,580 ఓట్లకు గాను 26,171 ఓట్లు పోల్ కాగా 88.48 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. నియోజకవర్గంలో అత్యధికంగా చౌటుప్పల్‌లో 92.50 శాతం, అత్యల్పంగా మర్రిగూడంలో 88.48 శాతం పోలింగ్ నమోదయింది. కాగా వివిధ మండలాల నుంచి ఈవీఎంలను అధికారులు చండూరు మండల కేంద్రంలోని డాన్ బొస్కో కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు తరలించారు. అనంతరం వాటిని నల్లగొండలోని ఓట్ల లెక్కింపు కేంద్రానికి తరలించారు.

నకిరేకల్ నియోజకవర్గంలో 86.67 శాతం

నకిరేకల్ : నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, కేతేపల్లి, నార్కట్‌పల్లి, రామన్నపేట, కట్టంగూర్, చిట్యాల మండలాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు బారులుదీరారు. నియోజకవర్గ వ్యాప్తంగా 305 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఉదయం 9 గంటలకు 6.62 శాతం పోలింగ్ నమోదయింది. 11 గంటలకు 22.10 శాతం, మధ్యాహ్నం ఒంటి గంటకు 39.49 శాతం పోలింగ్ నమోదయింది. సాయంత్రం 5 గంటలు దాటిన తరువాత క్యూలైన్‌లో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 86.67 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని నకిరేకల్, చిట్యాల, కేతేపల్లి, రామన్నపేట, కట్టంగూరు, నార్కట్‌పల్లి మండలాల్లో మొత్తం ఓటర్లు 2,50,547 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,24,668 మహిళలు 1,25,876 మంది, ట్రాన్స్‌జెండర్ ముగ్గురు ఉన్నారు. మొత్తం నియోజకవర్గ వ్యాప్తంగా 2,17,149 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 1,09,585 మహిళలు 107562 మంది, థర్డ్ జెండర్ ఇద్దరు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

నల్లగొండ టూటౌన్ : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ ఎమ్మెల్యే అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి పట్టణంలోని వీటీ కాలనీ కాకతీయ కాలేజీలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి నల్లగొండ పట్టణంలోని ఎంవీఆర్ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. నల్లగొండ బీజేపీ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ తన సతీమణి విజయలక్ష్మితో కలిసి మీర్‌బాగ్ కాలనీలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నరసింహారెడ్డి రామగిరిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో, మీర్‌బాగ్ కాలనీలో కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నల్లగొండ: కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆయన సతీమణి సబిత, కూతురు శ్రీనిధిరెడ్డి గురువారం నల్లగొండ పబ్లిక్ స్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. 32వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, 33వ వార్డు కౌన్సిలర్ బుర్రి చైతన్య మీర్‌బాగ్ కాలనీలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్ పోలింగ్ బూత్‌లో, మర్రిగూడలోని 36వ వార్డులో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి గుమ్మల జానకితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణంలోని 30వ వార్డుకు చెందిన స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి తన్నీరు యాదయ్య ఎన్జీ కళాశాలలో ఓటు వేశారు.



మునుగోడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కుటుంబ సభ్యులు



ఓటు వేసిన బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



ఓటు వేసి వస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి దంపతులు



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి

నకిరేకల్ : శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం నకిరేకల్‌లో కుటుంబ సమేతంగా వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లంలలో నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య ఓటు వేశారు. నకిరేకల్ మండలం పాలెంలో గోట్ అండ్ షీప్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, తాటికల్‌లో ఓయూ జేఏసీ, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ దంపతులు ఓటు వేశారు. నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో పోలింగ్ కేంద్రాలను బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు చిరుమర్తి లింగయ్య, వేముల వీరేశం పోలింగ్ సరళిని పరిశీలించారు.

చిట్యాల: మండలంలోని పలు పోలింగ్ బూత్‌లలో గురువారం పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో మదర్ డెయిరీ మాజీ చైర్మన్ గుత్తా జితేందర్‌రెడ్డి, చిట్యాల పోలింగ్ కేంద్రాల్లో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కన్వీనర్ పోకల అశోక్, సాక్షి టీవీ అవుట్‌పుట్ ఎడిటర్ గోధుమగడ్డ ప్రవీణ్‌రెడ్డి. పేరేపల్లిలో ఎంపీపీ కొలను సునిత, ఉరుమడ్లలో జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

చిట్యాల: మండలానికి చెందిన పలువురు నాయకులు నకిరేకల్ శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీపడుతున్నారు. వీరిలో బీఎల్ఎఫ్ అభ్యర్థి నూనె వెంకటస్వామి, స్వతంత్ర అభ్యర్థులు గంటెపాక స్వామి, మేడి నరేష్ చిట్యాలలోని పోలింగ్ కేంద్రాల్లో, వట్టిమర్తి గ్రామంలో బీఎస్పీ అభ్యర్థి మేడి ప్రియదర్శిని, వనిపాకల గ్రామంలో స్వతంత్ర అభ్యర్థి మేడి సంతోష్‌కుమార్ ఓటు వేశారు.

నార్కట్‌పల్లి : నకిరేకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య తన సొంత గ్రామం కొత్తగూడెంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన సొంత గ్రామం బి.వెల్లంలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి తన సొంత గ్రామం నక్కలపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి తన సొంత గ్రామం చెర్వుగట్టులో ఓటు హక్కు వినియోగించుకున్నారు.





నక్కలపల్లిలో ఓటు వేసిన జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

ఓటు వేసిన రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి



ఓటు వేసిన పున్న కైలాస్ నేత



పాలెంలో ఓటు వేసి వస్తున్న బాలరాజు



ఓటు వేసి వస్తున్న గుత్తా జితేందర్‌రెడ్డి



ఓటు వేసి వస్తున్న తిప్పర్తి ఎంపీపీ విజయలక్ష్మి



ఓటు హక్కు వినియోగించుకున్న తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి కుటుంబ సభ్యులు



నార్కట్‌పల్లి : కొత్తగూడెం గ్రామంలో ఓటు వేసిన చిరుమర్తి లింగయ్య



మునుగోడు: కోతులారంలో ఓటు హక్కు వినియోగించుకున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్



నకిరేకల్‌లో ఓటు వేసి వస్తున్న శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్



నకిరేకల్‌లో ఓటు వేసి వస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం-పుష్ప దంపతులు

కరీంనగర్ నుంచి వచ్చి ఓటేసిన ఎంబీబీఎస్ విద్యార్థిని

- అముక్తమాల్యదను అభినందించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్



అముక్తమాల్యద

రామగిరి(నల్లగొండ): కరీంనగర్‌లో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతూ స్వగ్రామమైన తిప్పర్తి మండలం సర్వారంకు వచ్చి మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతి కంచనపల్లి అముక్తమాల్యదను రాష్ట్ర ఎన్నికల కమిషన్ అభినందించింది. నేటి యువతకు స్ఫూర్తి కలిగించేలా అముక్తమాల్యద ఓటు వేసిన ఫొటోను అఫీషియల్ ట్విట్టర్ అకౌంట్‌లో ట్వీట్ చేసింది. ఈ సందర్భంగా సాక్షితో అముక్తమాల్యద మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తొలిసారి వినియోగించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. యువత తమ అమూల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అమెరికా నుంచి వచ్చి ఓటుహక్కు వినియోగం



అనిల్‌పవన్ కుమార్

శాలిగౌరారం: అమెరికాలో విద్యనభ్యసిస్తున్న శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన జమ్ము అనిల్ పవన్‌కుమార్ బుధవారం రాత్రి స్వదేశానికి వచ్చి గురువారం తన ఓటును వినియోగించుకున్నాడు. శాలిగౌరారంకు చెందిన జమ్ము రమేశ్–శ్రీలత దంపతుల కుమారుడు జమ్ము అనిల్‌పవన్ బీఫార్మసీ పూర్తిచేసి మాస్టర్‌డిగ్రీ కోసం గత సంవత్సరం అమెరికా దేశంలోని ఓహిఓ పట్టణానికి వెళ్లాడు. అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటుహక్కును వినియోగించుకునేందుకు వచ్చాడు.

ఈవీఎంల మొరాయింపు

త్రిపురారం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 271వ పోలింగ్ బూత్, బాబుసాయి పేటలో 263పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఎక్కువ సేపు క్యూ లైన్‌లో నిలబడి ఆలస్యం ఓటు వేయవల్సి వచ్చింది. అలాగే బాబుసాయి పేట, పెద్దదేవుల పల్లి, నర్లకంటి గూడెం గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి భగత్ ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు.

నకిరేకల్ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతం

కేతేపల్లి : మండలంలో 16 గ్రామాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. కేతేపల్లి మండలంలో 87.79 శాతం పోలింగ్ నమోదయింది. తొలి మూడు గంటల్లో 20 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. పలు గ్రామాల్లో సాయంత్ర 5 గంటల తర్వాత కూడా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు భారీ సంఖ్యలో క్యూలో ఉన్నారు. కేతేపల్లిలో 297 పోలింగ్ బూత్‌లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మండల వ్యాప్తంగా 30,470 ఓటర్లుకు గాను 26,750 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో మహిళలు 13380, పురుషులు 13370 ఉన్నారు.

నార్కట్‌పల్లిలో 85.85 శాతం

నార్కట్‌పల్లి : మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో గురువారం శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 85.85 శాతం పోలింగ్ నమోదయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ పద్మ తెలిపారు. నార్కట్‌పల్లి మండలంలో 42,609 మంది ఓటర్లకు గాను 36,579 మంది ఓటు వేశారు. అందులో 18,347 మంది పురుషులు, 18,232 మంది స్త్రీలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో 58 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరారు. మండలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ కొనసాగింది, కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం, బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.



నకిరేకల్ : చందుపట్లలో క్యూలో నిల్చున్న ఓటర్లు



కట్టంగూర్ : అయిటిపాములలో..

కట్టంగూర్ మండలంలో 88.52 శాతం

కట్టంగూర్ : మండలంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కట్టంగూర్ మండలంలో మొత్తం 36,642 మంది ఓటర్లు గాను 32,439 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో 88.52 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ డి స్వప్న తెలిపారు. కట్టంగూర్‌లో పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వేముల వీరేశం వేర్వేరుగా పరిశీలించారు. 2018లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మండలంలో 89.55 శాతం ఓట్లు నమోదు కాగా 2023లో 88.52 శాతం నమోదయింది. గతంలో కంటే మండలంలో 1.03 శాతం ఓటింగ్ తగ్గింది.

చిట్యాలలో ..

చిట్యాల: మండలవ్యాప్తంగా గురువారం రాష్ట్ర శాసన సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. చిట్యాల మండలంలోని 52 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. చిట్యాల మున్సిపాలిటీలో 99వ పోలింగ్ కేంద్రం, 100 పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు క్యూలైన్‌లో ఉండడంతో సాయంత్రం ఆరున్నర దాటినా పోలింగ్ జరిగింది. సుంకెనెపల్లి గ్రామంలో 60వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో అరగంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. ఎలికట్టె గ్రామంలోని పోలింగ్ స్టేషన్‌లో ఈవీఎం మిషన్ ఆగిపోవడంతో అధికారులు మరో మిషన్ తెప్పించి పోలింగ్ కొనసాగించారు. మున్సిపాలిటీలోని 99వ పోలింగ్ కేంద్రం వద్ద ఆరున్నర గంటలు దాటినా పోలింగ్ కొనసాగింది. ఈ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లతోపాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు గుమిగూడడంతో పోలీసులు చెదరగొట్టారు. పిట్టంపల్లి గ్రామంలో అత్యధికంగా 98 శాతం 1185 ఓటర్లుకు గాను 1109 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

శాలిగౌరారంలో 86.93 శాతం

శాలిగౌరారం : మండలంలో చెదురుమదురు సంఘటనలు మినహా అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండల వ్యాప్తంగా మొత్తం 39386 మంది ఓటర్లు ఉండగా 34239 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలంలో 86.93 శాతం ఓటింగ్ నమోదయింది. పెర్కకొండారం గ్రామంలోని 106 పోలింగ్ కేంద్రంలో మినహా మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం ఐదు గంటలకే పోలింగ్ ప్రక్రియ ముగిసింది. పెర్కకొండారంలోని 106వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలో సాయంత్రం 4 గంటలకు సాంకేతిక సమస్య తలెత్తడంతో రెండు గంటలపాటు పోలింగ్ నిలిచిపోయింది. సంబంధిత టెక్నికల్ సిబ్బంది వెంటనే పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఈవీఎంను సరిచేయడంతో తిరిగి సాయంత్రం 6 గంటలకు ఓటింగ్ ప్రారంభమయ్యింది. ఓటు వేసేందుకు క్యూలో ఉన్న 200 మంది ఓటర్లు రాత్రి 8 గంటల వరకు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

'మునుగోడు' పోలింగ్ ఇలా..



మునుగోడు: కొంపల్లిలో క్యూ కట్టిన ఓటర్లు



మర్రిగూడ : రాంరెడ్డిపల్లిలో....

మునుగోడు: మండల వ్యాప్తంగా ఉన్న 26 గ్రామాల్లో గురువారం అసెంబ్లీ ఎన్నికల్లో 44 పోలింగ్ బూత్‌లలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల వరకు 10.5 శాతం, 11 గంటలకు 28.39 శాతం, ఒంటి గంటకు 42.33 శాతం , మధ్యాహ్నం 3 గంటలకు 52.77 శాతం పోలింగ్ నమోదయింది. 5 గంటల వరకు 75.6 శాతం పోలింగ్ నమోదుకాగా అప్పటికే ఓటు వేయకుండా పోలింగ్ కేంద్రాల్లో క్యూ కట్టిన ఓటర్లు రాత్రి 8 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మర్రిగూడ మండలంలో..

మర్రిగూడ : మండల వ్యాప్తంగా 18 గ్రామ పంచాయతీల్లో 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాంరెడ్డిపల్లిలో ఓటింగ్ సమయం ముగిసేసరికి వీవీ ప్యాట్ ఎర్రర్ చూపడంతో 9 మంది ఓటర్లు గంటపాటు పోలింగ్ కేంద్రంలో నిరీక్షించాల్సి వచ్చింది. రాత్రి 8.15గంటల వరకు వీవీ ప్యాట్‌ను సరిచేయడంతో ఆ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. యరగండ్లపల్లి, దామెర భీమనపల్లితోపాటు పలు గ్రామాల్లో ఈవీఎం మిషన్లు మొరాయించగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఎన్నికలు సజావుగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నాంపల్లి సీఐ ఎ.నవీన్‌కుమార్, స్థానిక ఎస్ఐ కె.రంగారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నాంపల్లిలో..

నాంపల్లి : మండలంలోని 46 బూత్‌లలో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరిగింది. మండలంలో చిన్నచిన్న సంఘటనలు మినహా ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘనలు జరగలేదు.